# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **కర్నూలు జిల్లాలో రేపు జరిగే సామాజిక పెన్షన్ల పంపిణీలో ముఖ్య మంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు పాల్గొంటారు.**

2. **విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల ఏర్పాట్లు చివరి దశకు చేరుకున్నాయి.**

3. **దసరా ..., దీపావళి ... పండుగల సందర్భంగా స్వస్థలాలకు వెళ్ళే ప్రయాణీకుల కోసం దక్షిణ మధ్య రైల్వే 650 ప్రత్యేక రైళ్ళను నడుపుతోంది.**

4. **ప్రధాన మంత్రి జన్ జాతీ ఉన్నత్ అభియాన్ కార్యక్రమం అమలు కోసం రాష్ట్రంలో 878 గిరిజన గ్రామాలు ఎంపికయ్యాయి.**

5. **ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం ఈ ఏడాది ప్రముఖ హిందీ నటుడు మిథున్ చక్రవర్తికి లభించింది.**

**==========================**

రాష్ట్రంలో రేపు సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుంది. కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలోని పుచ్చకాయలమడ గ్రామంలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా పాల్గొని పెన్షన్లు పంపిణీ చేసి .... లబ్ధిదారులతో కొద్దీ సేపు ముచ్చటిస్తారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని కూడా ఆవిష్కరిస్తారు. ఆ తరువాత స్వచ్ఛతా హి సేవా ప్రతిజ్ఞ చేయించి ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొంటారు.

------------------------

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అక్టోబరు 3వ తేదీ నుండి జరగనున్న దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చివరి దశకు చేరుకున్నాయి. గత ఏడాది కంటే ఈ సారి దుర్గమ్మ వారిని దర్శించుకునే భక్తుల సంఖ్య అధికంగా ఉండగలదన్న అంచనాతో ఎన్.టి.ఆర్. జిల్లా కలెక్టర్ సృజన ..., దేవస్థానం ..., పోలీసు అధికారులు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండేలా సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్లు ...., స్నాన ఘాట్‌లు ..., సౌచాలయాలు ..., తాగు నీటి సరఫరా ...., పారిశుధ్యం వంటి అంశాలపై వీరు నిరంతరం సమీక్షిస్తూ తదనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. దసరా ఉత్సవ ఏర్పాట్లపై ఇంద్రకీలాద్రిపై నిన్న జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...

.....వాయిస్.... 53 సెకన్లు....

---------------------------

దసరా ... దీపావళి ... ఛఠ్ పండుగల సందర్భంగా రాష్ట్రంలో స్వస్థలాలకు వెళ్ళే ప్రయాణికుల కోసం 650 ప్రత్యేక రైళ్ళను నడపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. దేశ వ్యాప్తంగా నడపనున్న ఆరు వేల ప్రత్యేక రైళ్లలో భాగంగా రాష్ట్రంలో 650 రైళ్ళను నడుపుతామని, అక్టోబర్ ఒకటి నుండి నవంబర్ 30వ తేదీ వరకు నడిపే ఈ ప్రత్యేక రైళ్ల సదుపాయాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొంది.

---------------------------

దసరా, దీపావళి పండుగల్లో ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు వాల్తేర్ రైల్వే సీనియర్ డివిజన్ కమర్షియల్ మేనేజర్ కే సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు..ఈ క్రమంలో వాల్తేర్ డివిజన్ నుంచి నిర్ధేశించిన తేదీల్లో మొత్తం 14 జతల ప్రత్యేకరైళ్లను ప్రవేశపెడుతున్నారు. విశాఖపట్నం నుండి సికింద్రాబాద్, తిరుపతి, బెంగళూరు, అరకు, వీ+= చెన్నై సెంట్రల్,షాలిమార్, శ్రీకాకుళం రోడ్డు నుండి తిరుపతి, కొల్లం లకు ఇరువైపుల రైళ్లను నడపనున్నారు.... ఇవి కాక ఇప్పుడున్న రైళ్లకు అదనంగా జనరల్ క్లాస్, స్లీపర్ క్లాస్ 3ఎసి కోచ్‌లు కూడా జోడిస్తున్నట్లు తెలిపారు...

---------------------------

అక్టోబర్ రెండవ తేదీ నుండి ప్రారంభం కానున్న "ప్రధాన మంత్రి జన్ జాతీ ఉన్నత్ అభియాన్" కార్యక్రమం కింద రాష్ట్రంలోని గిరిజన గ్రామాలలో 25 రకాల అభివృద్ధి పనులు చేపడతారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 జిల్లాల పరిధిలోని 878 గ్రామాలు ఈ కార్యక్రమం కింద ఎంపికయ్యాయి. రహదారులతో పాటు ఈ గ్రామాలలో సిమెంట్ రోడ్ల నిర్మాణం ..., రక్షిత నీరు ...., విద్యుత్ ...., వైద్య సౌకర్యాలు ...., ఇళ్ల నిర్మాణం ...., గ్యాస్ కనెక్షన్లు ...., టెలిఫోన్..., పాఠశాల ..., అంగన్వాడీ కేంద్రం ..., మార్కెట్ వంటి 25 రకాల సదుపాయాలు కల్పిస్తారు. 878 గ్రామాలలో చేపట్టనున్న అభివృద్ధి పనుల ప్రాథమిక.జాబితాను కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి గతి శక్తి పోర్టల్'లో ఉంచింది. దీనిని ఆయా శాఖల అధికారులు పరిశీలించి పనులు చేపట్టేందుకు అనుమతులు కోరుతూ అక్టోబర్ నెలాఖరులోగా నివేదికలు పంపవలసి ఉంటుంది.

---------------------------

పరిశుభ్రతకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు. అధికారులతో కలిసి తెనాలి పట్టణంలో నిన్న ఆయన పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిశుభ్రత లోపించిన ప్రాంతాల్లోని పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

---------------------------

ఈరోజు అంతర్జాతీయ అనువాదకుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఒక భాషలోని భావాలను మరొక భాష మాట్లాడే ప్రజలకు అర్థమయ్యేలా కృషి చేస్తున్న వీరి సేవలను గుర్తించే ఉద్దేశ్యంతో ఐక్య రాజ్య సమితి పిలుపు మేరకు ప్రతి ఏటా సెప్టెంబర్ 30వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. ప్రపంచ అనువాద పితామహునిగా పేరొందిన ...., గ్రీకు భాషలో ఉన్న బైబిల్ ను లాటిన్ భాషలోకి అనువదించిన సెయింట్ జోరం వర్ధంతిని

అనువాదకుల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. క్రీస్తు పూర్వం 420 సంవత్సరం సెప్టెంబర్ 30వ తేదీన బేత్లహాం నగరంలో మరణించారు. వివిధ భాషలలోని సమాచార వ్యాప్తి  కోసం అనువాదకులు నిర్వహిస్తున్న పాత్ర పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈరోజు పలు కార్యక్రమాలు జరుగుతున్నాయి.

---------------------------

రాష్ట్రంలోని ప్రభుత్వ .... ప్రైవేటు...., ఎయిడెడ్ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ .... అపార్ కార్డులు ఇవ్వాలని విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ కార్డులపై తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని సూచించింది. ఈ కార్డులలో విద్యార్థి పేరు, పుట్టినరోజు, ఫోటో, క్యూ ఆర్ కోడ్,  12 అంకెలతో గుర్తింపు నంబర్ ఉంటుంది. విద్యార్థుల విద్యా సంబంధ సమాచారం ..., తదితర వివరాలు ఇందులో ఉంటాయి.

---------------------------

తిరుమల లడ్డూ కల్తీ అంశంపై ప్రత్యేక దర్యాప్తు బృందం ... సిట్  .... సభ్యులు ఈ రోజు మూడవ రోజు విచారణ కొనసాగిస్తున్నారు. దర్యాప్తు కోసం సిట్ సభ్యులు రెండు బృందాలుగా ఏర్పడ్డారు. ఒక బృందం తమిళనాడులోని  దిమ్మిగల్‌కు వెళ్ళగా ....., మరొక బృందం తిరుపతి ..., తిరుమలలో పర్యటిస్తోంది.  తిరుపతిలోని టి.టి.డి. గిడ్డంగిలో బృంద సభ్యులు విచారణ జరుపుతున్నారు.

---------------------------

శ్రీ వారి లడ్డూ కల్తీ అంశంపై ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ దీక్ష విరమణ కోసం రేపు తిరుమలకు వెళ్లనున్నారు. వచ్చే మూడు రోజుల పాటు ఆయన తిరుమలలోనే  బస చేస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన అలిపిరి పాదాల మండపం వద్ద రేపు సాయంత్రం ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం.... నడక మార్గం ద్వారా తిరుమలకు చేరుకుంటారు.రెండవ తేదీ ఉదయం శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారు.

---------------------------

చలన చిత్ర రంగంలో ప్రతిష్ఠాత్మకమైన దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారానికి ఈ ఏడాది ప్రముఖ హిందీ నటుడు  మిథున్ చక్రవర్తి ఎంపికయ్యారు. కేంద్ర సమాచార ...., ప్రసార మంత్రిత్వ శాఖ ఎక్స్ లో ఈ రోజు ఈ విషయం ప్రకటించింది. అక్టోబర్ 8 వ తేదీన జరిగే 70 వ చలన చిత్ర పురస్కారాల వేడుకలో మిథున్ చక్రవర్తికి ఈ పురస్కారం ఇవ్వనున్నట్టు తెలిపింది. 1976వ సంవత్సరంలో సినీ ప్రస్థానం ప్రారంభించిన  మిథున్ చక్రవర్తి.. నటునిగా ...., చిత్ర నిర్మాతగా బహుముఖ సేవలు అందించారు. చలన చిత్ర పరిశ్రమకు ఆయన అందజేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం గత జనవరిలో పద్మ భూషణ్ పురస్కారాన్ని ప్రకటించింది. ఇప్పుడు దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారంతో సత్కరించనున్నది.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రేపు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం-టిటిడి ఒక ప్రకటనలో తెలిపింది. అక్టోబర్ 4 నుంచి 12 వరకు తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో అక్టోబర్ 1న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం తెలిపింది. ఈ నేపథ్యంలో రేపు అష్టదళ పాదపద్మారాధన సేవను రద్దు చేసినట్లు పేర్కొంది.

వీఐపీ బ్రేక్ దర్శనాలు కూడా ప్రొటోకాల్ వీఐపీలకు మినహా మిగిలిన వారికి రద్దు చేశారు. దీంతో ఈ నెల 30న ఎటువంటి సిఫార్సు లేఖలు స్వీకరించరని టిటిడి ఆ ప్రకటనలో తెలిపింది.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 40 సెకన్లు....

======================